# చరిత్ర చూపిన మార్గం

## పి.వి.ఆర్. శివకుమార్

భరతమాత రత్నగర్భ. సందేహం లేదు. దేశ మంతటా నదీనదాలు - అనుమానం అక్కర్లేదు. విస్తారంగా పర్వతశ్రేణులు - అటవీసంపద - ఉత్తరాన హిమగిరిశ్రేణులు - పెట్టనికోట గోడలుగా (ఆ కోటకి పడుతున్న బీటలూ - చొరబడుతున్న ముష్కరులూ - అది వేరే కథ)

ప్రకృతి మాత చల్లగా చూస్తున్నంతవరకూ పై వనరులన్నీ మన దేశం సుభిక్షంగా వుండేలా కాపాడుతూ వుంటాయి. (మనం కొండల్ని తొలిచి, అడవుల్ని నరికి, నదులన్నీ ఆనకట్టలతో ఎండగట్టి, తల్లీ నీ దయ అంటే ఆ ప్రకృతి మాత్రం ఏం చేస్తుంది?)

మానవుడి వికృత కార్యాలకి ప్రకృతి కోపించినప్పుడు వస్తుంది ప్రళయం - అది అగ్నిప్రళయమైనా కావచ్చు - జలప్రళయమైనా కావచ్చు - ఈ మధ్య సముద్రాల్లోనూ అగ్నిపర్వతాలూ ప్రేలుతున్నాయి - సునామీల్ని సృష్టిస్తున్నాయి గనక ఆ తరహా ప్రళయమైనా కావచ్చు!

అటువంటి ప్రళయాల్ని నివారించాలంటే మనిషి వికృత చర్యల్ని మానుకోవాలి!

అటువంటి ప్రళయాల్ని ఎదుర్కోవాలంటే మనిషి ముందుజాగ్రత్త చర్యల్ని విస్తారంగా చేపట్టాలి!

అటువంటి ప్రళయాలు ముంచెత్తినప్పుడు మనిషి విస్తృత సహాయక చర్యలు చేపట్టాలి!

ఈ మూడు చర్యల్లోనూ ఏది చేపట్టటానికయినా చిత్తశుద్ధి, కార్యదీక్ష, సాధించాలన్న తపనా వుండాలి.


అవి ఏవీ లేనినాడు మానవజాతి ఆ ప్రళయాలకి తలొగ్గి బలికాక తప్పదు - మాడి మసికాక తప్పదు. మునిగి నశించిపోక తప్పదు.

మార్గాంతరం ఏముంది గనక?

***

మూడేళ్లుగా అంతో, యింతో సుభిక్షంగా వున్న రాష్ట్రంలో ఈ ఏడాది ఎండాకాలం వెళ్లిపోయినా ఎండలు మాత్రం వెళ్లిపోలేదు! ప్రకృతి ప్రస్తుతానికి వానాకాలాన్ని మర్చిపోయింది! ఫలితం... క్షామం... క్షామం... రాష్ట్రమంతటా క్షామం!

పొరుగు రాష్ట్రాలు సహాయం చేస్తాయన్న ఆశతో - ''పొరుగు రాష్ట్రాల వాళ్లూ! పొరుగు రాష్ట్రాల వాళ్లూ!.... మా పొలాలు ఎండిపోయాయి.. మీకు అన్నో, యిన్నో వానలు పడ్డాయిగా! మా నదుల్లోకి నీళ్లు కాసిని మాకు వదలరూ'' అని బ్రతిమాలారు సర్కారు వారు-'' పైగా, మీ పార్టీ, మా పార్టీ ఒకటే కూడానూ!'' అని ముక్తాయించారు.



"పార్టీలు ఒకటైనా రాష్ట్రాలు వేరుకదా! పైగా, యివాళ వున్నాయి కదా అని వొలక బోసుకుంటే, రేపు లేని నాడు మాకెవరిస్తారూ?" అని దీర్ఘాలు తీశారు పొరుగు రాష్ట్రాల వారు.

"నదీజలాల్ని జాతీయం చేయాలని ఎన్నియుగాలుగా మొత్తుకుంటున్నా, ఏ చర్యా చేపట్టనందుకు ఇప్పుడనుభవిస్తున్నాం! అయినా గాలీ, నీరూ ఎవడబ్బసొత్తు" అంటూ జాతీయగీతమంత పాత గీతాన్ని మళ్లీ ఆలపించాయి ప్రతిపక్షాలు.

ఎవరేమన్నా ఏమనుకున్నా రాష్ట్రంలో పొలాలన్నీ ఎండి ఫెళఫెళలాడాయి! పశువులకి గడ్డి కూడా లేక ఎండిపోయాయి!

"మీకు ఓట్లు వేసి గెలిపిస్తే, వరుణదేవుడికి ఆగ్రహం వస్తుందని ప్రజలకి తెలీదు పాపం!" అని వెటకారమాడారు ప్రతిపక్షం వాళ్లు!

ఆ దృష్టికి విరుగుడుగా రాష్ట్రమంతటా హోరాహోరీగా వరుణయాగాలు ప్రారంభించారు.

"ఈ క్షామాలూ, యీతిబాధలూ ప్రతి ఏడు వస్తూనే వున్నాయి గనుక, వరుణయాగానికి సపరేటుగా ఓ మినిస్ట్రీనే పెట్టేసి, నన్నా మినిస్ట్రీకీ కాబినెట్ రాంకు మినిస్టర్ని చేస్తోపోలా! సక్రమంగా యాగాలు చేయిస్తూ వుంటానుగా!" ఏడేళ్లయి స్వపక్ష ఎమ్మెల్యేగా వున్నా, సహాయ మంత్రిత్వానికి కూడా నోచుకోని బామ్మర్ది, ముఖ్యమంత్రిగారి చెవిలో ఇల్లు కట్టుకు పోరా(డా)డు!

"సర్లేవయ్యా మగడా! ఇప్పటికిప్పుడు ఇలాటి ఎత్తు ఎత్తితే – అవతల ప్రతి పక్షాలకి పనిగట్టుకుని బడితెకర్ర చేతికిచ్చినట్టవుతుంది! ప్రస్తుతానికి, యాగాల నిర్వహణకో ప్రత్యేక కమిటీవేసి, నిన్నుదానికి అధ్యక్షుడిగా చేస్తాన్లే! అటు రాష్ట్ర క్షామమూ, యిటు నీ ఏడేళ్ల క్షామమూ తీరేలా యాగాల్చేయించు!" అన్నాడు ముఖ్యమంత్రి

ప్రతి జిల్లా కేంద్రంలోనూ లక్షల ఖర్చుతో యాగాలు మొదలయ్యాయి! ఆ యాగాలు మరీ మోతాదు మించటంతో, ఆ యజ్ఞగుండాలు వెలువరించిన వేడికి ఆకాశానికి అంతెత్తున వున్న మబ్బులన్నీ తునకలతో సహా కరిగాయి! ఆ కరగటం సదరు రాష్ట్రానికున్న (?) ఆకాశం లోనివే కాక, చుట్టుపక్కల రాష్ట్రాల తాలూకు ఆకాశాల మీది మబ్బుల్ని కూడా కరిగించేశాయి.

ఊహకందక పోవటమే ప్రకృతి నైజం! మనం ఎన్ని వాతావరణ కేంద్రాలు పెట్టుకుని అంచనాలు వేసుకున్నా, చివరికి ఆకాశాన్ని మబ్బులు కమ్మేశాకే వానొస్తుందని వాతావరణం వివరాల్లో చెప్పినట్టు – కుంభవృష్టి మొదలయ్యాకే – వరదలొస్తున్నాయన్న గమనింపు గలిగింది!

వరదలు మొదలవటంతోనే, పొరుగు రాష్ట్రాల వాళ్లు కళ్లు తెరిచారు. డాముల తలుపులూ తెరిచారు.

"హలో... హలో... క్షామంగా వుందన్నారుగా! ఇవిగో నీళ్లు వదుల్తున్నాం – తీసుకోండి! మణిసన్నాక, ఆ మాత్రం ఇరుగూ, పొరుగూ సాయం చేసుకోకపోతే ఎలా? – పైగా మనం మనం ఒక పార్టీ వాళ్లమేనాయె!" అంటూ

నిన్నటిదాకా క్షామంతో ఎండిపోయిన రాష్ట్రం, యివాళ వరదలతో అతలా కుతలమై పోయింది!

ఒక వూరూ, ఒక వాడా కాకుండా ప్రతి జిల్లాలోనూ వరదలు వూళ్లని ముంచెత్తాయి! ఇళ్లూ ఆస్తులే కాక, గొడ్డూగోదా కూడా సముద్రం పాలయ్యాయి. జన నష్టం అంచనాల కందటం లేదు.

"డెబ్బై ఏళ్లుగా యిలాంటి జలప్రళయం చూడలేదు" అన్నారు వృద్ధులు!

ప్రభుత్వం సహాయ చర్యలు ప్రారంభించింది.

మంత్రివర్గం సహావేశమయింది. వరద సహాయక చర్యల గురించి కూలంకష చర్చ జరిగింది. కేంద్రాన్ని పది లక్షల కోట్ల సహాయం అర్థించింది.

కేంద్రం తమ బృందాన్ని పంపింది!


'ఏమిటీ వాళ్లొచ్చి చూసేది? సవాలక్ష టివి ఛానెళ్లు సజీవ ప్రసారాలు చేస్తుంటే, ఆ వివరాలు చూడలేక మళ్లా ప్రత్యేక విమానాలూ, హెలికాప్టర్లూ వేసుకు రావాలా?'

సణుక్కున్నారు సామాన్యులు.

మాన్యులు మాత్రం హెలికాప్టర్ విహారాలు పూర్తిచేసి రాజధాని చేరారు.

"అయ్యో" అన్నారు. "చొచ్చొచ్చో..." అన్నారు.

"ఇది జాతీయ విపత్తు" అన్నారు. "దేశమంతా మీ రాష్ట్రంలోనే వుంది" అన్నారు. చివరిగా "ప్రస్తుతానికి వెయ్యి కోట్లు వుంచండి. అసలు నష్టం అంచనా కట్టాక, తతిమ్మాది ఆలోచిద్దాం" అన్నారు.



నాల్రోజులకి వరద తీసింది. వూళ్లు పోయి బీళ్లు మిగిలాయి! ప్రజలు తమ అవస్థలు తాముపడుతూ, పాడుబడ్డ ఆవాసాల్ని వాసయోగ్యంగా మలుచుకునే ప్రయత్నాల్లో పడ్డారు.

ప్రతిపక్షాలు అవకాశానికి తగ్గట్టుగా అస్త్రాలు సంధించాయి.

"కనీవినీ ఎరుగని రీతిలో వరదలు సంభవించాయి. సహాయక చర్యలు కంటి తుడుపుగా చేసేసి, చేతులు దులుపుకుంటే సరిపోదు. శాశ్వత పరిష్కారాలు ఆలోచించాలి. ఆ దిశలో చర్యలు తీసుకోవాలి.

మరోసారి యిలాటి విపత్తు సంభవిస్తే, ఇంతటి నష్టం కలగకుండా శాశ్వతంగా జాగ్రత్త పడాలి" అంటూ అసెంబ్లీని హోరెత్తించాయి.

దాంతో మంత్రి వర్గం మళ్లీ సమావేశమయింది.

ఈ వరదలెందుకు సంభవించాయి? సంభవించకుండా ముందు జాగ్రత్తలు ఏం తీసుకోవాలి? సంభవిస్తే, ఆ వరదలు జనావాసాల్ని ముంచెత్తకుండా దారి మళ్లించటానికి ఏం చెయ్యాలి? ఆ ప్రమాద జలాల్ని భూగర్భ జలాలుగా మార్చేందుకు ఏ మార్గం వుంది?

ఇత్యాది ప్రశ్నలకి సమాధానాలు వెతికేందుకు పదహారుగురు సభ్యులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటయింది. ఆ కమిటీలో ప్రతిపార్టీకి దామాషా పద్ధతిన స్థానం దొరికింది. దాంతో ముందు అపోజిషన్ సమస్య తీరింది. మంత్రులు, శాసనసభ్యులకే పరిమితమయిన ఆ కమిటీలో ఒక వాతావరణ నిపుణుడికి స్థానం కల్పించారు.

కమిటీ మూడు సమావేశాల సుదీర్ఘచర్చల అనంతరం వరదల పుట్టు పూర్వోత్తరాలు, కార్యాచరణ సంబంధాలు, నిరోధానికై ఇతః పూర్వం వివిధ రాష్ట్రాలు చేపట్టినచర్యలు, వాటివల్ల ఒనగూడిన ఉపయోగాలు, తద నంతర పరిణామాలు యిత్యాది వివరాలతో సమగ్ర నివేదిక తయారు చేయాలనీ, ఆ తర్వాత ఆ వివరాలు ఆధారంగా నివారణ చర్యలపై తమ రాష్ట్ర ప్రభుత్వానికి ఒక కార్య ప్రణాళిక తయారుచేసి సమర్పించాలనీ నిర్ణయించారు.

సదరు నివేదిక తయారుచేసే బాధ్యత కమిటీ సభ్యుడయిన వాతావరణ నిపుణుడిపై వుంచారు. మిగతా సభ్యులంతా గతంలో వరదలకి గురయిన వివిధ దేశాలలో విస్తృతంగా పర్యటించేటట్లూ, ఆ పర్యటనలో సేకరించే వివరాలు వాతావరణ నిపుణుడికీ చేరేటట్లూ, ఆ వివరాల ఆధారంగా సదరు నిపుణుడు నివేదిక రూపొందించేటట్లూ నిర్ణయించబడింది.

సత్వరం విదేశీ పర్యటనలు ఖరారు చేయబడ్డాయి. ప్రజల కడగళ్లు చూడ లేని సభ్యులు వెంటనే సుదూర దేశాలకి ఎగిరెళ్లిపోయారు!

పది నెలల సమయం పట్టాక, పదిహేను కోట్లు ఖర్చు జమపడ్డాక నివేదిక తయారయింది. వాతావరణ నిపుణుడి పొట్టి సంతకం మీద సభ్యు లందరి పెద్ద సంతకాలతో ఆ నివేదిక ప్రభుత్వానికి సమర్పించబడింది.

కాబినెట్ సమావేశంలో ఆ నివేదికని చర్చకు తీసుకున్నారు.

"ఇంతలావు నివేదిక చదివే తీరిక ఎవరికుం

దయ్యా? అవతల దేశం పిలుస్తోంది - సేవలకి. మూడు ముక్కల్లో చెప్పండి ఏం చెప్పదల్చు కున్నారో-'' విసుక్కున్నారు మంత్రులు.

''అయ్యా - అది కూడా వుందండి మొదటి మూడు పేజీల్లోనే'' చెప్పారు సెక్రటీ గారు.

'దేశ వ్యాప్తంగా సమగ్ర జలసంధానం, ప్రస్తుతం వున్న ఆనకట్టలని మరింత బలోపేతం చేయటం, నదీ పరీవాహక ప్రాంతాల్లో అటవీ సంపద అభివృద్ధి, కొత్త ఆనకట్టల నిర్మాణం, గ్రామాల్లో లోతైన చెరువుల త్రవ్వకం - యివన్నీ కాక పునరావాస కేంద్రాలని పటిష్టం చేయటం - యివీ ఆ నివేదిక సిఫారసులు! ఏ ఏ నదుల్ని ఎక్కడ సంధానం చేయాలో, ఎక్కడ ఆనకట్టల్ని కొత్తగా కట్టాలో, ఏ గ్రామాల్లో చెరువులు తవ్వాలో యిత్యాది వివరాలూ అందులో వున్నాయి.

''బావుందయ్యా - దేశ వ్యాప్త జలవిధానం మన చేతుల్లో వుందా? అది కేంద్రం చూసుకోవాలి? ఇహ మిగతా సిఫారసులు అమలు జరపాలంటే ఎంతవుద్దో...''

ఇవన్నీ అమలు జరపటానికి ఏడేళ్ల ప్రణాళికా - అందుకయ్యే ఖర్చులూ - వివరంగా రూపొందించారండి! మొత్తం పదహారు వేల కోట్లు అవుతుందటండి!

''పదహారు వేల కోట్లు....?!''

''అంటే అంతా ఒక్కసారి కాదనుకోండి! ఏడాదికింత చొప్పున ఏడేళ్ళలో మొత్తం సమకూర్చి ఖర్చులు తట్టుకోవచ్చునండి!''

''అయితే మాత్రం? అంత డబ్బు మనం ఎలా సమీకరించగలం?''

''కేంద్రాన్ని ఆశ్రయించాల్సిందే!''

''ఈసారి లోక్‌సభలో అరడజను సీట్లు తగ్గాయని కేంద్రం అసలే మన మీద గుర్రుగా వుంది!

గొణిగారు ముఖ్యమంత్రిగారు.

''బావుంది! ఇప్పుడు సహాయం చేయకపోతే, ఇంకో డజను సీట్లు తగ్గుతాయి పై ఎన్నికల్లో''.

''ఆ ముక్క కేంద్రంతో అనగలమా? అని, మనగలమా?''

అరగంట తర్జనభర్జనల అనంతరం ఈ ఖర్చు భరించటం యిప్పట్లో సాధ్యం కాదని మెజారిటీవర్గం అభిప్రాయానికి వచ్చింది. అలాగే, నివేదిక నిర్లక్ష్యం చేసినా, ఏదో ఒక చర్చని చేపట్టకపోయినా ఆ కమిటీలోని ప్రతిపక్ష సభ్యులు వూరుకోరు.

కర్ర విరగని, పాము చావని, ఆ మార్గం ఏది? ఏది? ఏది? డబ్బు ఖర్చు కాకుండా, నివేదిక నిర్లక్ష్యం అయినట్లు బయటపడకుండా, తాము బయటపడటం ఎలా??

ఆలోచనలు... ఆలోచనలు..

మళ్ళా, మళ్ళా, మళ్ళా నివేదికనంతా అమూలాగ్రం తిరగేసిన 'ఆర్థిక మంత్రి గారి ఆప్తసెగ్రటీ' ఉత్సాహంగా లేచి నిలబడ్డాడు.

''నివేదికనంతా తిరగేశానండి! ఓ అత్యంత ముఖ్యవిషయం యిందులో ఉటంకించబడిందండి!''

''ఏమిటి... ఏమిటది...?''

అంతా ఆతృతగా అతనివేపు చూశారు.

''ఈ స్థాయిలో వరదలు మొదటగా మన రివ్యాకి అందినంతలో 1744లో వచ్చాయట. ఆ తర్వాత 1837లో వచ్చాయట. ఇంతకు మునుపు లేటెస్టుగా అంటే 1923లో రాష్ట్రాన్ని యిలాంటి వరదలు ముంచెత్తాయిట.

''అబ్బబ్బ... ఆ వరదల ఇష్టరీతో యిప్పుడేంటయ్యా ఉపయోగం?'' అరిచారు ఆర్థిక మంత్రిగారు.

''వస్తున్నానండి! అంటే యిలాటి భారీ వరదలు సుమారు 80 సంవత్సరాల కొకసారి వస్తున్నాయన్న మాట!''

''అంటే యీసారి భారీవరదలు 2089 వస్తాయా?''

''అంతేనండి. అంటే 2089 లోపుగా వచ్చే అవకాశాలు లేవన్నది నా పాయింటు!''

''గుడ్... అయితే ఎప్పుడో 2089లో వచ్చే అవసరం కోసం యిప్పుడే పదారు వేల కోట్ల ప్రజాధనం వెచ్చించటం బాధ్యతారాహిత్యం!''

''అవును. ఈ ప్రణాళిక అమలుకు ఏడేళ్లు పడుతుందని అంచనా గనుక, 2082లో ప్రణాళిక ప్రారంభించటం సబబు''.

''అయినా అనుకున్నంత వ్యవధిలో ప్రణాళికలు పూర్తికావు గనుకా, 2089లో అనుకున్న వరదలు ఒకటి రెండేళ్లు అటూ యిటూ కావచ్చు గనుకా, మనం యీ ప్రణాళికని 2075లోనే ప్రారంభించటం ముందు జాగ్రత్త అవుతుంది!''

ముఖ్యమంత్రి బాధ్యతాయుత ప్రకటన అందరికీ ఆమోదయోగ్యంగా అనిపించింది.

''అవును. మనం 2075లోనే ప్రణాళికని ప్రారంభించాల్సిందే. 2085 కల్లా అన్ని చర్యలు పూర్తిచేసి, 2089లో వచ్చే వరదల వల్ల ప్రజలకి ఎలాంటి కష్టనష్టాలూ సంభవించకుండా కాపాడుకోవలసిందే!''

ఆ ఏకగ్రీవ తీర్మానంతో సభ వాయిదా పడింది!

ప్రభుత్వ సుదూర దృష్టికి ప్రతిపక్షాలూ సంతోషించాయి.

సర్వే జనాః సుఖినోభవంతు!

❑

రచయిత సెల్ నెం: **9010344405**

# సినిమాలంటే పిచ్చి



ప్రియా ఆనంద్‌తో చిట్‌చాట్

ఆమె తెలుగులో చేసిన రెండు సినిమాలూ విజయవంతం అయ్యాయనే చెప్పాలి. పుట్టింది చెన్నయ్‌లో. పెరిగింది హైదరాబాద్‌లో. చదువుకుంది అమెరికాలో. ఈ పాటికే ఎవరో ఊహించే ఉంటారు. ఆమే ప్రియా ఆనంద్. ప్రియ నటించిన 'లీడర్', 'రామ రామ కృష్ణ కృష్ణ' రెండూ ఆమెకు మంచి పేరును తెచ్చిపెట్టినా స్టార్ ఇమేజ్‌ని మాత్రం తీసుకు రాలేకపోయాయి. నటించడం కన్నా డైరెక్ట్ చేయడం ఎక్కువ ఇష్టం అంటున్నా ప్రియతో చిట్‌చాట్...

**మీ గురించి చెప్పండి...**

పుట్టింది చెన్నయ్‌లో, పెరిగింది తమిళనాడులో. సుమారు పది సంవత్సరాల క్రితమే మా ఫ్యామిలీ అమెరికాకు షిఫ్ట్ అయింది. నా చదువు అక్కడే పూర్తి చేశాను. చిన్నప్పటి నుంచీ సినిమాలంటే తెగ పిచ్చి. అయితే నటించడం కన్నా టెక్నికల్ వర్క్ అంటేనే ఎక్కువ ఇష్టం. ఆ ఇష్టంతోనే దర్శకుడు శంకర్ దగ్గర శిక్షణ తీసుకోవాలన్న ఉద్దేశంతో చెన్నయ్ వచ్చాను.

**మరి సినిమాల్లోకి ఎలా వచ్చారు?**

చెన్నయ్ రాగానే సినిమా అవకాశాల కన్నా ముందు కొన్ని కమర్షియల్ యాడ్స్‌లో నటించే అవకాశం వచ్చింది. వాటిలో చేస్తుండగా 'లీడర్'లో ఛాన్స్ వచ్చింది. వెంటనే 'రామ రామ కృష్ణ కృష్ణ'లో రామ్ పక్కన ఓ హీరోయిన్‌గా నటించే అవకాశం వచ్చింది. కమర్షియల్‌గా ఆ సినిమా మంచి విజయం సాధించింది. అలా హీరోయిన్‌గా తెలుగు ఇండస్ట్రీలో కాలుపెట్టి ఇప్పుడిప్పుడే నిలదొక్కుకుంటున్నాను.

**తెలుగు సినిమాలు చూస్తారా?**

అమెరికాలో ఉండగా అక్కడి సినిమాలతో పాటు దక్షిణాది భాషా చిత్రాలు వీలయినంత వరకూ చూసేదాన్ని. చెన్నయ్ వచ్చిన తరువాత కేవలం దక్షిణాది భాషా చిత్రాల డివిడిలు వేసుకొని అవి మాత్రమే చూస్తున్నాను.

**తెలుగు బాగా వచ్చా?**

బాగా వచ్చా? అంటే అంత బాగా రాదు. కొద్ది కొద్దిగా మాట్లాడగలను అంతే!

**తెలుగులో మీకు నచ్చిన నటులు ఎవరు?**

ఇంకెవరు బ్రహ్మానందంగారు. ఆయన చేసే కామెడీకి నవ్వలేక కళ్ళ వెంట నీళ్ళు వస్తాయి. ఆయన సినిమాలు దాదాపు అన్నీ చూశాను.